క్లుప్తంగా

ప్రభుత్వ విద్యాలయాల్లో అడ్మిషన్ల కోసం ప్రచారం

పెదవేగి : రానున్న విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల సిబ్బంది జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు ఈ విషయంలో ఓ అడుగు ముందే ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి తమ పాఠశాలలో చేర్పించండంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయులు మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా ఇంటికీ వెళ్లి కరపత్రం తల్లిదండ్రులకు అందించి స్కూలు ప్రగతి, విద్యార్థులు సాధించిన ర్యాంకులు వివరిస్తూ తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలంటూ కోరుతున్నారు.

ఇంటర్, డిగ్రీ కళాశాలలదీ అదే తీరు

పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వేటలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల్లోని అధ్యాపకులు నిమగ్నమయ్యారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇంటింటికీ వెళ్లి కలిసి తమ కళాశాలలోని సౌకర్యాలు, బోధన, సాధించిన ఫలితాలు, అమలు చేస్తున్న పథకాలను వివరించి వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ కళాశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలంటూ ప్రచారం చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల బీభత్సం

పెదవేగి : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో టీడీపీ నాయకులు కార్యకర్తల దాడులు మిన్నంటాయి. పెదవేగి మండలం వంగూరు-లక్ష్మీపురం, విజయరాయి గ్రామాల్లో విజయోత్సాహంతో ఉన్న టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్ సీపీకి చెందిన వారి ఇళ్లకు వెళ్లి వారి వస్తువులను ధ్వంసం చేసి, స్థానికంగా గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదులు చేసేందుకు నేతలు సిద్ధపడుతున్నారు. కొండలరావుపాలెంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటి వద్ద భారీగా పోలీసు బలగాలు మోహరించి, అటువైపుగా టీడీపీ ర్యాలీ నిర్వహిస్తుందన్న సమాచారంతో ఎటువంటి అల్లర్లు జరగకుండా డీఎస్పీ జి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వెంకన్న చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని చిరంజీవి బస్ స్టాండ్, దక్షిణపు వీధి, మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంతం, రాజా గారి మేడ ప్రాంతం, జేపీ కాలనీ, పెద్ద దేవుడి గుడి ప్రాంతం, పోణంగి రోడ్డు, శనగపప్పు బజారు పరిసర ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ధర్మాజీగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ రాజీనామా

లింగపాలెం: ధర్మాజీగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్ రాజీనామా చేశారు. ఈమేరకు మంగళవారం నూజివీడు విభాగ సహకార అధికారికి ఆయన రాజీనామా పత్రాన్ని అందశారు. అనివార్య కారణాల వల్ల చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నానని, రాజీనామా పత్రంలో పేర్కొన్నారు.

చింతలపూడి - కాంతంపాలెం కల్వర్టుకు మోక్షం



చింతలపూడి - కాంతంపాలెం గ్రామాల మధ్య శిథిలావస్థలో ఉన్న కల్వర్టు(ఫైల్)

చింతలపూడి: చింతలపూడి – కాంతంపాలెం ప్రధాన రహదారి పైన పానకాల చెరువు గట్టుపై కల్వర్టుకు మోక్షం లభించింది. గ్రామస్తుల కోరిక మేరకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు కల్వర్టు నిర్మాణానికి సుమారు రూ.58 లక్షలు నిధులను మంజూరు చేయడంతో ఇటీవల అధికారులు కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దాదాపు 4 దశాబ్దాలుగా పానకాల చెరువుపై అలుగు పారే ప్రాంతంలో వంతెన ఇరుకుగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండే వారు. గతంలో ఇదే కల్వర్టును దాటే సమయంలో ఆర్టీసీ బస్సు పడిపోయింది. అదే విధంగా అనేకసార్లు లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు లేక పోలేదు. అనేక సార్లు గ్రామస్తులు ఇక్కడి నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోవడం, వినతిపత్రాలు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు గ్రామానికి వచ్చిన సందర్భంలో గ్రామస్తులు కల్వర్టు నిర్మాణం గురించి ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఎంపీ శ్రీధర్‌బాబు తక్షణం స్పందించి తన పార్లమెంట్ అభివృద్ధి నిధుల నుంచి నిధులు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల నెరవేరింది.

దివ్యాంగుల పాఠశాలలో 'ప్రత్యేక' శిక్షణ

- పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండ
- నామమాత్రపు ఫీజులతో చిన్నారులకు విద్యా సేవలు



జానంపేటలోని ప్రకాశ్‌నగర్‌లో ప్రత్యేక అవసరాల చిన్నారుల కోసం నిర్మించిన ప్రత్యేక పాఠశాల



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

పెదవేగి : ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు చేయూత నివ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిసాలెస్ స్పెషల్ స్కూల్ హెచ్ఎం సిస్టర్ సుష మ్యాథ్యూ అన్నారు. పెదవేగి మండలంలోని జానంపేట పంచాయతీ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో 2006లో డిసాలెస్ ప్రత్యేక పాఠశాలను (చెవుడు, మూగ విద్యార్థులకు మాత్రమే) స్థాపించారు. ఈ ప్రత్యేక అవసరాల పాఠశాల డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్ అనే మిషనరీ ఎన్‌జీఓ సంస్థ ద్వారా నడుపుతున్నారు. ఈ పాఠశాల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ బోధన చేస్తున్నారు. ఈ పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందింది. ప్రత్యేక శిక్షణ పొందిన బోధన సిబ్బందితో తరగతులను నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 50 మంది బాలబాలికలు విద్యనభ్యసిస్తున్నారు. మరో 50 మంది వరకూ అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే స్టేట్ సిలబస్‌నే బోధిస్తారు. 15 ఏళ్లలోపు మూగ, చెవుడు విద్యార్థులు ఇక్కడ దరఖాస్తు చేసుకోవటానికి అర్హులు. విద్యతోపాటు, పూర్తి హాస్టల్ సదుపాయం సైతం ఉచితంగా కల్పించారు. చదువుతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం శిక్షణ ఇస్తున్నారు. ఇతర వివరాలకు ఫోన్ 6281428466, 8985468473, 7356006778 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్ పాఠశాలను ఏర్పాటుచేసి పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని చెవిటి, మూగ చిన్నారులకు బాసట నిలిచేందుకు కృషి చేస్తున్నాం. నామమాత్రపు ఫీజులతో అందించే ఈ విద్య, వసతి సౌకర్యాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి. – సిస్టర్ సుష మ్యాథ్యూ, ప్రిన్సిపల్, డిసాలెస్ ప్రత్యేక పాఠశాల





కంప్యూటర్, వినికిడి యంత్రం ద్వారా శిక్షణ పొందుతున్న చిన్నారులు



తరగతి గదుల్లో విద్యార్థులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



భీమడోలులో చిన్నారులకు శిక్షణ అందిస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్

భీమడోలు: గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జన నిలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం వేసవి శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. చిన్నారులకు నీతి కథలు, పుస్తక సమీక్షలు, జీకే తదితర అంశాలపై రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ శిక్షణ అందించారు. వేసవిలో ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా విజ్ఞానాన్ని అందుతుందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. శిక్షణ పొందడం ద్వారా శక్తులుగా తీర్చిదిద్దబడతారన్నారు. తొలుత చిన్నారులకు తమ్ముడు అసూయ, అన్న సాయం అనే నీతి కథను గ్రంథపాలకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మానుష్యంగా ఏలూరు నగరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ జిల్లా కేంద్రం ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికల నిమిత్తం సోమవారం ఉదయం నుంచే నగరం రద్దీగా మారగా, మంగళవారం ఉదయం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారింది. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభించడంతో ఆయా అసెంబ్లీ స్థానాల నుంచి విచ్చేసిన వివిధ పార్టీల అభిమానులు, కార్యకర్తలు నగరంలోని లాడ్జిల్లో రూముల్లో ఉండి టీవీల్లో ఫలితాల సరళిని గమనిస్తూ ఉన్నారు. ఉదయం 10 గంటల సమయానికే కౌంటింగ్‌పై విశ్లేషించుకున్న కొందరు అప్పటి నుంచే రూములు ఖాళీ చేసి తిరుగు ప్రయాణమవడం కనిపించింది. కాగా గెలుస్తున్న అభ్యర్థుల తాలూకు అభిమానులు, కార్యకర్తలు తమ అభ్యర్థులకు వస్తున్న మెజారిటీపై, ఏ గ్రామంలో పోలింగ్ ఎలా జరిగింది? ఎక్కడ ఓట్లు ఎక్కువ వచ్చాయి? ఎక్కడ తక్కువ వచ్చాయి? అనే విశ్లేషణలు చేసుకున్నారు. కాగా కౌంటింగ్ ప్రాంతానికి నియమావళిని అనుసరించి 200 మీటర్ల దూరంలో కొందరు కార్లలో వేచి చూస్తూ ఫోన్లలోనే తమ నాయకుల విజయాలకు సంబంధించిన విషయాలను తమ గ్రామాల్లోని తమ కార్యకర్తలతో పంచుకోవడం కనిపించింది. కౌంటింగ్ నేపథ్యంలో నగరంలోని దుకాణాలు మూసివేయడం, ప్రజలుసైతం టీవీలకు అతుక్కుపోయి కౌంటింగ్‌కు సంబంధించిన వార్తలు చూస్తూ బయటకు రాలేదు. నగరం మొత్తం నిర్మానుష్యంగా మారింది. గెలిచిన అభ్యర్థుల ర్యాలీలు, విజయోత్సవాలు చేయడానికి లేదని ఎన్నికల కమిషన్ నిబంధన విధించడంతో నగరంలో ఎక్కడా ర్యాలీలు కనిపించలేదు. అక్కడక్కడా పేటల్లో యువకులు బైకులపై శబ్దాలు చేస్తూ తిరగడం వీధుల్లో బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు.

ప్రతి ఒక్కరూ సమన్వయంతో మెలగాలి

ఏలూరు (టూటౌన్): ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పోటీ ఉన్న ఎవరో ఒక్కరే గెలుస్తారని, మిగిలిన వారికి ఓటమి తప్పదని, దీన్ని ప్రతి ఒక్కరూ స్పోర్టివ్‌గా తీసుకుని సమన్వయంతో మెలగాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏలూరు పార్లమెంట్‌కు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం వంటి చర్యలకు దిగొద్దని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం మనమంతా ఒక్కటిగానే మెలగాలని సూచించారు. పార్టీల అభిమానం ఎన్నికల సమయం వరకే పరిమితం చేయాలని, ప్రజలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల నాయకులు సైతం రెచ్చగొట్టే విధంగా విద్వేషపూరిత ప్రసంగాలు చేయవద్దని, దాడులకు పురికొల్పవద్దని కోరారు. ఏలూరు జిల్లా ప్రశాంతతకు మారు పేరుగా నిలుస్తుందని, అటువంటి ఏలూరు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటివ్వకుండా నాయకులు, కార్యకర్తలు మెలగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా అధికార యంత్రాంగం సైతం జాగ్రత్త చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు పోలీసులు, అధికార యంత్రాంగానికి పూర్తిగా సహకరించాల్సిందిగా సంతోష్‌కుమార్ కోరారు.

కూటమి అభ్యర్థులు చింతమనేని, పత్సమట్లదే విజయం



దెందులూరు ఆర్వో లావణ్యవేణి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ఆర్వో నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పత్సమట్ల ధర్మరాజు

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యేగా కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ విజయం సాధించారు. మంగళవారం ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కౌంటింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరిగింది. దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరిపై 26,457 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన కౌంటింగ్ 18 రౌండ్లల్లో ఈవీఎంలు, తొలుత పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహించారు. 14 టేబుళ్లల్లో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. కొఠారు అబ్బయ్యచౌదరికి 81,021 ఓట్లు రాగా, చింతమనేని ప్రభాకర్‌కు 1,07,287 ఓట్లువచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో చింతమనేని ప్రభాకర్‌కు 960, కొఠారు అబ్బయ్యచౌదరికి 769 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్‌లో చింతమనేని ప్రభాకర్‌కు 191 ఓట్లు మెజార్టీ వచ్చింది. పోటీ చేసిన అభ్యర్థుల్లో నేతల రమేష్‌కు 1,602, చిలుకూరి ప్రభాకరరావుకు 143, ఆముదాలపల్లి ప్రసాద్‌కు 68, అశోక్‌చౌదరికి 74, అలగా రవికుమార్‌కు 9, కొనకళ్ల శ్రీనివాసరావుకు 40, చెరుకూరి శ్రీరామ్ కుమార్‌కు 126, నాగరామ ప్రసాద్ పెరిశెట్టికి 70, నూతి నాగరాజుకు 75, నూతి రవీంద్రకు 143, పచ్చిగోళ్ల జాన్ ధర్మరాజుకు 167, పల్లె రమేష్‌కు 354, నోటాకు 1,920 ఓట్లు నియోజకవర్గంలో పోలయ్యాయి. కౌంటింగ్ అనంతరం జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. కౌంటింగ్‌లో అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు ఉన్నారు. కౌంటింగ్ ఆద్యంతం మూడంచెల పోలీస్ భద్రత మధ్య జిల్లా అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేశారు.

ఉంగుటూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ధర్మరాజు విజయం

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యేగా జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు గెలుపొందారు. మంగళవారం ఏలూరులో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో ధర్మరాజు 44,945 ఓట్ల మెజార్టీతో సమీప అభ్యర్థి వైఎస్సార్‌సీపీకి చెందిన పుప్పాల వాసుబాబుపై విజయం సాధించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎన్‌డీఏ అభ్యర్థి ధర్మరాజుకు మెజార్టీ లభించింది.

ప్రజల తీర్పును శిరసా వహిస్తాం

బీసీ సెల్ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ



నౌడు వెంకట రమణ

నిడమర్రు: భీమడోలు: రాష్ట్రంలో సార్వత్రిక ఫలితాల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తామని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నౌడు వెంకట రమణ మంగళవారం రాత్రి అన్నారు. ఏపీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలోని పేదలకు, దళితులకు, గిరిజనులకు, బీసీలకు మైనార్టీ వర్గాలకు అండగా ఉండి వారికి రాజ్యాధికారంతో పాటు అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల పక్షాన నిలిచారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పార్టీపై ప్రజలు ఇచ్చిన తీర్పును పార్టీ తరుపున శిరసా వహిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమైనని, ఈ ఎన్నికల్లో పార్టీని రెండోసారి గెలుపించుకోవాలన్న ఆకాంక్షతో ఎన్నో విధాలుగా పాటు పడిన నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు పార్టీ ఎంతో రుణపడి ఉంటుందన్నారు. మన మంతా నిరుత్సాహం చెందకుండా నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామన్నారు. గెలుపొందిన పార్టీకి, అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ, కూటమి పార్టీలు ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఏ ఒక్క హామీని అమలు చేయకపోయినా అధికార పార్టీని ప్రజల ముందు నిలదీస్తామన్నారు.

సంతోష్ కుటుంబానికి పరామర్శ




సంతోష్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కుక్కునూరు: వేలేరుపాడు మండలంలోని కోయమాధారం దగ్గర సోమవారం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వరుస సంతోష్ కుటుంబాన్ని మంగళవారం సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి పరామర్శించారు. సంతోష్ తండ్రి వరుస నాగేశ్వరరావు గతంలో సీపీఐలో క్రియాశీల కార్యకర్తగా, నాయకునిగా పనిచేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. ఆయన వెంట సీపీఐ జిల్లా నాయకులు కురాకుల బాబూరావు, గిరిజన సంఘం నాయకులు పాపారావు, రైతు సంఘం నాయకులు నకెరకంటి నాగరాజు పాల్గొన్నారు.

అరుదైన ఫలాలకు ఔషధ గుణాలెన్నో







సీతారామ లక్ష్మణ హనుమద్ ఫలాలు

కొయ్యలగూడెం: ఇతిహాసాలను ఇనుమడించేలా ప్రకృతిలో కాసిన కాయలకు మన పూర్వీకులు పెట్టిన పేర్లు సనాతన హైందవమత సంస్కృతి సాంప్రదాయానికి ఆలంబనగా నిలిచాయి. అటువంటి వాటిలో సీత రామ లక్ష్మణ హనుమద్ ఫలాలు ఒకటి. నేటి తరం వారికి సీతాఫలం గురించి తెలిసి ఉంటుందే కానీ రామలక్ష్మణ హనుమద్ ఫలాలు గురించి అంతగా తెలిసి ఉండకపోవచ్చు. పచ్చని రంగుతో సీతాఫలం, రామనీలంతో రామా ఫలం, కాయపై ముళ్లతో ఉమ్మెత్త కాయను పోలిన విధంగా ఉండే లక్ష్మణ ఫలం, సింధూర వర్ణంతో హనుమద్ ఫలం ఉండడం విశేషం. నాలుగు రకాల ఫలాలకు పదిహేడు రకాల కేన్సర్ వ్యాధులను నిరోధించే, నిర్మూలించే శక్తి ఉండటం వీటి ప్రాముఖ్యత. శాస్త్రీయంగా కూడా కేన్సర్ వ్యాధులకు ఈ నాలుగు రకాల పండ్ల మేలు చేకూరుస్తాయని నిపుణులు సైతం ధ్రువీకరించారు. సంవత్సరం పొడుగునా నాలుగు రకాల ఫలాలు కాయడం వీటి విశిష్టత. వర్షాకాలం, శీతాకాలంలో సీతాఫలం, శీతాకాలం ముగింపులో హనుమద్ ఫలం, వేసవికాలంలో రామలక్ష్మణ ఫలాలు కాస్తుంటాయి. ఎన్నో రెట్ల ఔషధ గుణాలు కలిగిన పండ్ల గుజ్జు మొదలుకొని పైన తొక్క, గింజలు సైతం ఆయుర్వేదంలో వైద్య చికిత్సకు వినియోగిస్తుంటారు. ఇవి ఏజెన్సీ మెట్ట ప్రాంతాల్లో మాత్రమే విరివిగా లభ్యం అవుతూ ఉంటాయి. ఈ నాలుగు చెట్ల ఆకులను సైతం ఆయుర్వేద చికిత్సలో వినియోగిస్తుంటారు. భావితరాల వారికి ఔషధ గుణాలను కలిగిన ఈ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించడంతోపాటు ప్రతి ఇంటికి ఇటువంటి మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలి అని ఆయుర్వేద ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్ (పంగిడిగూడెం) పేర్కొన్నారు.